క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మద్రిపాలెం: జోన్–2 ఎన్‌ఎస్‌టీఎల్ సెక్షన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల నిర్వహణ, మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు 11 కేవీ తెన్నేటినగర్, సీతన్న గార్డెన్స్ ఫీడర్ల పరిధిలోని కనకదుర్గా ఫంక్షన్ హాల్ జంక్షన్, మాధవధార, గాయత్రి విద్యా మందిర్ రోడ్డు, జనతా గ్యారేజ్ జంక్షన్, గ్యాస్ గొడౌన్ జంక్షన్, తెన్నేటినగర్, ఎంఎస్ఆర్ పార్కు రోడ్డు, రాంసాయి ఫ్లోర్ కూడలి నుంచి వాటర్ ట్యాంక్ వరకు, మాధవధార, ఎస్‌పీడీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

రోడ్డెక్కిన మురుగుతో అవస్థలు



శంకరమఠం కూడలిలో రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న మురుగు నీరు

సీతంపేట: శంకరమఠం రోడ్డులో మురుగు నీరు రోడ్డెక్కి ప్రవహించడంతో జనం ఇబ్బందులకు గురయ్యారు. గురువారం శంకరమఠం కూడలిలో డ్రెయిన్ పొంగి పొర్లడంతో రోడ్డుపై నుంచి మురుగు నీరు ఏరులై ప్రవహించింది. అటు డైమండ్ పార్క్, ఇటు శంకరమఠం వైపు వెళ్లే వాహన చోదకులు, పాదచారులు మురుగు నీటి ప్రవాహంతో అవస్థల పాలయ్యారు. డ్రెయిన్లలో వ్యర్థాలు, చెత్త సక్రమంగా తొలగించ లేదు. దీంతో వర్షపు నీటి ప్రవాహానికి డ్రెయిన్‌లో చెత్త బ్లాక్ అయి మురుగు నీరు రోడ్డుపై నుంచి ప్రవహిస్తోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పునరావృతం కాకుండా తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పెద్దలను గౌరవించాలి



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

మురళీనగర్: తల్లిదండ్రులతోపాటు పెద్దలను గౌరవించడం నేర్చుకోవాలని విద్యార్థులకు విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు జీఎస్ఎన్ మూర్తి సూచించారు. మురళీనగర్ మహిళలు, పిల్లల శాఖ గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. నైతిక విలువలు పెంచే పుస్తకాలను చదవాలన్నారు. విద్యార్థులు పుస్తక పఠనం చేశారు. లైబ్రేరియన్ వై.పద్మజ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పద క్రీడలను నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ



వైర్ బ్యాగులు ప్రదర్శిస్తున్న మహిళలు

మురళీనగర్: మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహిస్తున్న వేసవి ఉచిత శిక్షణ శిబిరం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మహిళలు తాము శిక్షణలో తయారు చేసిన వైరు బ్యాగులను ప్రదర్శించారు. క్లబ్ కోశాధికారి భానుమతి మహిళలకు 16 రోజుల పాటు అల్లికలతోపాటు, కుట్టు శిక్షణ ఇచ్చారని ప్రభావతి తెలిపారు. ఈ సందర్భంగా భానుమతిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఎం.జయ, ఐటీ కో ఆర్డినేటర్ సిహెచ్.జ్యోతి, కోశాధికారి కె.భానుమతి, బులిటెన్ ఎడిటర్ సిహెచ్.పద్మావతి పాల్గొన్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. భక్తులు రూ.1,000 రుసుం చెల్లించి ఈ పూజలో పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

దిల్ మ్యాంగో మోర్



ప్రకృతి మనకు ఎన్నో రకాల మధుర ఫలాలను అందిస్తోంది. వాటిలో మామిడి పండును రారాజుగా చెప్పవచ్చు. మామిడి పండ్లకు సుమారు 4 వేల ఏళ్ల చరిత్ర ఉంది. వేసవి కాలం వచ్చిందంటే చాలు.. చిన్నాపెద్దా అంతా మామిడి పండ్ల కోసం ఎంతో ఆశగా ఎదురు చూస్తుంటారు. అరటి, బొప్పాయి, ఏపిల్ వంటి కొన్ని పండ్లు ఏడాది పొడుగునా అందుబాటులో ఉంటాయి. మ్యాంగో వంటి కొన్ని ప్రత్యేక పండ్లు మాత్రమే సీజనల్‌గా దొరుకుతాయి. మన దేశంలోనే అత్యధికంగా మామిడి పండిస్తున్నారు. మన రాష్ట్రంలో ఎన్నో రకాల మామిడి పండ్లు, కాయలు అందుబాటులో ఉన్నాయి.

- తాటిచెట్లపాలెం

- పండ్లలో రారాజు మామిడి
- వేసవిలో అందరూ ఇష్టంగా తినే ఈ ఫలాలకు ఫుల్ డిమాండ్
- నోరూరించే ఆవకాయ పచ్చళ్లకు వినియోగం
- మార్కెట్‌లో జోరుగా మామిడి పండ్ల విక్రయాలు

వేసవిలో లభించే మామిడి పండ్లకు మార్కెట్‌లో ఫుల్ డిమాండ్ ఉంటుంది. మొత్తంగా 35 రకాల మామిడి ఉన్నా.. మన రాష్ట్రంలో ప్రాముఖ్యంగా బంగినపల్లి, సువర్ణరేఖ, రసాలు పరియాలు, కొత్తపల్లి కొబ్బరి వంటివి లభిస్తాయి. నియోజకవర్గంలో మామిడి పండ్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఈ పండ్లు కేవలం ప్రత్యక్షంగా తినడానికే కాకుండా.. మామిడితో తాండ్ర (మ్యాంగో జెల్లీ), ఆవకాయ(తీపి, కారం), ఊరగాయ, తొక్కుడు వంటి పచ్చళ్లకు కూడా వాడతారు.

సీతమ్మధార రైతుబజార్‌లో మామిడి స్టాళ్లు

సీతమ్మధార రైతుబజార్‌లో మొత్తం 150 వరకు స్టాళ్లు ఉంటే.. వాటిలో ఉదయం 20, సాయంత్రం 20 స్టాళ్లను కేవలం మామిడి పండ్లు, కాయల కోసం కేటాయించారు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో సుమారు 30 మంది రైతులు మామిడి పండ్లు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. ఇక్కడ బంగినపల్లి, సువర్ణరేఖ, కొత్తపల్లి కొబ్బరి, కలెక్టర్ కాయలు, పెద్దరసాలు, చిన్నరసాలు, పరియాలు, పుణుకులు, పంచదార కల్తీలు, ఇమందు పసందు వంటివి అందుబాటులో ఉన్నాయి. మన జిల్లాలో రైతులు ఎక్కువగా కశింకోట, కోటపాడు, ఆనందపురం మండలాల్లో ఎక్కువగా బంగినపల్లి, సువర్ణరేఖ, కొత్తపల్లి కొబ్బరి వంటి రకాలను పండిస్తున్నారు. గతేడాదితో పోలిస్తే వినియోగదారులకు, కొనుగోలుదారులకు ధర సంతృప్తిగానే ఉన్నా.. రైతులకు మాత్రం ఈ ఏడాది నష్టాన్ని మిగులుస్తోందని వీరు వాపోతున్నారు.



సీతమ్మధార రైతుబజార్‌లో విక్రయిస్తున్న వివిధ రకాల మామిడి పండ్లు

పుష్కలంగా ఔషధ గుణాలు



మామిడిలో ఆరోగ్యాన్ని కాపాడే ఔషధ గుణాలు పుష్కలంగా ఉన్నాయి. కేలరీలు, ప్రోటీన్లు, కొవ్వులు, కార్బోహైడ్రేట్స్, చక్కెర, ఫైబర్, పొటాషియం, కాల్షియంతోపాటు ఏ, బీ, సీ విటమిన్లు, మినరల్స్ ఉంటాయి. కంటికి, చర్మానికి, కేశ రక్షణలతోపాటు గుండె జబ్బులు, క్యాన్సర్‌ను నివారించడంలో కూడా మామిడి సహకరిస్తుందని వివిధ సర్వేలు చెబుతున్నాయి. డయాబెటిస్ ఉన్నవారు మామిడి పండ్లు తినకూడదనేది గతంలో నానుడి. ఇప్పుడు కొందరు మామిడిపండ్లు తగు మోతాదులో తీసుకోవడం మంచిదని ఆహార నిపుణులు సూచిస్తున్నారు.



సీతమ్మధార రైతుబజార్‌లో నోరూరించే మామిడి పండ్లు

సొంతంగా పండించి తీసుకొస్తున్నాం



రైతుబజార్‌కు మామిడి పండ్లు, కాయలు తీసుకొచ్చే రైతులు సొంతంగా పండించడం వల్ల మాత్రమే ఇలా అమ్మగలుగుతున్నాం. తోటలు చాలా దెబ్బతిని, నష్టాలు వచ్చాయి. అయినా మామిడి పండ్లు కోసం ఎదురుచూసే వారికి ప్రతి రోజూ మేం మామిడి పండ్లు తీసుకొస్తున్నాం. ఏప్రిల్ చివరి వారం నుంచి జూన్ వరకు మాత్రమే మామిడి పండ్లు, కాయలు అమ్ముతుంటాం.

– నారాయణమూర్తి, రైతు, ఆర్లి

అకాల వర్షాలతో నష్టపోతున్నాం



గతేడాది దిగుబడి బాగానే ఉంది. ధరలు కూడా మంచిగా ఉన్నాయి. ఈ ఏడాది అకాల వర్షాల వల్ల చాలా నష్టాలు చూడాల్సి వస్తోంది. పూత దశలోనే రాలిపోవడం, చేతికి వచ్చిన పంటకు సరైన ధర లేకపోవడంతో నష్టపోతున్నాం. ఎక్కువగా బంగినపల్లి, సువర్ణరేఖ, రసాలు, కొత్తపల్లి కొబరి వంటి మామిడి పండ్లు సీతమ్మధార రైతుబజార్‌లో అమ్ముతుంటాం.

– జి.కన్నారావు, రైతు, తీడ

వేసవిలో మామిడి విక్రయిస్తుంటాం



ప్రతి ఏటా వేసవిలో మామిడి పండ్లు కూడా అమ్ముతుంటాం. ఈ ఏడాది పెద్దగా లాభాలు లేవు. వర్షాల కారణంగా పండ్లు ఎక్కువ కాలం ఉండటం లేదు. దీంతో నష్టాలకు అమ్ముకోవాల్సి వస్తుంది. గతేడాది ఎక్కువగా పంట చేతికొచ్చింది. ఈ నెలలో మాత్రమే మామిడి పండ్లు తీసుకువస్తాం. మిగిలిన రోజుల్లో కాయగూరలు తీసుకొచ్చి విక్రయిస్తాం.

– జి.రాజు, రైతు, ఎల్.కొత్తూరు

పచ్చడి కాయలకు గిరాకీ



సువర్ణరేఖ, పెద్ద రసాలు, కలెక్టర్ కాయ, బారామస్సు వంటి మామిడి కాయలతో పచ్చళ్లు పెడతారు. దీంతో వీటికి కొంచెం డిమాండ్ ఉంది. కేవలం పచ్చళ్ల ప్రియులు మాత్రం ప్రతీ ఏటా సీజన్‌లో మామిడి కొనుగోలు చేయడం వల్ల కొంచెం అమ్మకాలు జరుగుతున్నాయి. ఈ ఏడాది ధర బాగా తగ్గింది. మంచి కాయలతో పచ్చళ్లు పడితే ఏడాది పొడుగునా నిల్వ ఉంటుంది.

– సన్నిబాబు, మామిడి రైతు, తీడ

కమనీయం.. సీతారాముల కల్యాణం

వీణాపాణి–కోదండపాణిగా యోగ సిద్ధాంజనేయుడు



వీణాపాణిగా యోగ సిద్ధాంజనేయ స్వామి



వేదికపై సీతారాముల కల్యాణమూర్తులు




అన్నదానం చేస్తున్న ఆలయ నిర్వాహకులు

మురళీనగర్: జాతీయ రహదారి సూర్యానగర్–2లోని యోగ సిద్ధాంజనేయ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న హనుమజ్జయంతి ఉత్సవాలు గురువారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అర్చక బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా మంగళధ్వని, వేద మంత్రాలతో యోగ సిద్ధాంజనేయుడికి సుప్రభాత సేవ నిర్వహించారు. వీణాపాణి–కోదండపాణిగా స్వామిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. యోగ సిద్ధాంజనేయుడికి, ఉత్సవ మూర్తికి అర్చన, విశేష హోమాలు, పూర్ణాహుతి సమర్పించారు. అనంతరం ప్రత్యేకం వేదికపై సీతారామ లక్ష్మణ హనుమ సమేత పట్టాభిషేకమూర్తులను ప్రతిష్ఠించి లోక కల్యాణార్థం సీతారాముల కల్యాణం అశేష భక్తజనుల సమక్షంలో కనుల పండువగా నిర్వహించారు. వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయ అర్చకుడు జి.శేషాచార్యుడు రాములోరి కల్యాణ వైభోగాన్ని వివరించారు. మధ్యాహ్నం కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక టెంట్‌లో 15,000 మంది భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం యోగ సిద్ధాంజనేయ స్వామికి సహస్ర నామాలతో సింధూర అర్చన చేసి భజనానంద హారతిని సమర్పించారు. వేద ఆశీర్వచనం స్వస్తితో ఉత్సవాలు ముగిశాయి. వేలాదిగా భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ వ్యవస్థాపకులు పి.సుబ్బరాజు, యశోద దంపతులు, అర్చకుడు ఆరవెల్లి శ్రీకాంతాచార్యుడు, ఆలయ కమిటీ సభ్యుడు, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి



లలితా పీఠంలో అభయాంజనేయుడు



తాటిచెట్లపాలెంలో ఆంజనేయ స్వామి



మధురానగర్ హనుమాన్ ఆలయంలో అభిషేక సేవలో భక్తులు



మురళీనగర్‌లో స్వామిని దర్శించుకుంటున్న రెయ్యి వెంకటరమణ, సనపల చంద్రమౌళి



గణేష్‌నగర్ ఆలయంలో సింధూర పూజలో పాల్గొన్న భక్తులు



దాసాంజనేయుడికి తమలపాకులతో పూజ చేస్తున్న అర్చకుడు

సీతంపేట: రామదూత హనుమాన్ జయంతి వేడుకలు నియోజకవర్గంలో గురువారం వైభవంగా నిర్వహించారు. సీతంపేట పార్వతీశ్వరాలయ ఆవరణలోని అభయాంజనేయ స్వామికి విశేష పూజలు చేశారు. ఆలయ అర్చకులు స్వామికి పంచామృత, గంధ, విభూది, పండ్ల రసాలతో అభిషేకం, తమలపాకులతో అష్టోత్తరం, సింధూరంతో అర్చన జరిపారు. భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

- సీతంపేట మెయిన్ రోడ్డులోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. మధురానగర్ శ్రీ సద్గురు బ్రహ్మ రామదూత ఆలయంలో అభిషేకాలు, అర్చనలు, తమలపాకులు, సింధూరం, వడమాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తమలపాకులతో అర్చన చేశారు. స్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.
- లలితానగర్ శ్రీలలితా పీఠంలో విశేష పంచామృతాభిషేకం, అర్చన, మన్యుసూక్త హిత మూలమంత్ర హోమం నిర్వహించారు. సాయంత్రం తమలపాకులతో సహస్ర నామార్చన, వడమాలతో పూజలు జరిపారు. పీఠం దర్బారు హాల్లో హనుమాన్ చాలీసా, సుందరాకాండ పారాయణ కడురమ్యంగా జరిగింది. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. జగన్నాథపురంలోని మూడు గుళ్ల వద్ద కొలువైన అభయాంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విశేష పూజలు, అభిషేకాలు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 14వ వార్డు గణేష్‌నగర్‌లోని త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన దేవాలయంలో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు వి.ఎస్.కుమార్, అధ్యక్షుడు టి.ఎస్.ఎన్.మూర్తి, గౌరవాధ్యక్షుడు ఎన్.వెంకటరెడ్డి, కమిటీ సభ్యులు ఎం.ఎస్.ప్రకాశరావు, బి.కె.నాయుడు, కె.ఎస్.ఎన్.మూర్తి, జయ్‌బాబు, శ్రీరామమూర్తి, వెంకటలక్ష్మి ట, మహాలక్ష్మి, సరస్వతి, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

- 45వ వార్డు తాటిచెట్లపాలెం జాతీయ రహదారి పక్కనున్న సుందర అభయాంజనేయ స్వామి ఆలయంలో ఉదయం 5.30 గంటల నుంచి పంచామృతాభిషేకాలు, సింధూర అర్చన, లక్ష తమలపాకులతో విశేషాభిషేకాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ అధ్యక్షుడు ఆళ్ల నరసింగరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అభయాంజనేయుడికి పూజలు

మద్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డు మురళీనగర్‌లోని అభయ ఆంజనేయస్వామి ఆలయంలో స్వామికి వీఎంఆర్‌డీఏ మాజీ చైర్మన్ సనపల చంద్రమౌళి ఆధ్వర్యంలో విశేష పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ స్వామిని దర్శించుకుని, హోమంలో పాల్గొన్నారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

దాసాంజనేయుడికి పంచామృతాభిషేకం

మురళీనగర్: పట్టాభిరెడ్డితోటలో వెలసిన దాసాంజనేయ స్వామికి సుగంధ ద్రవ్యాలతో కూడిన జలాలతో పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఆరవిల్లి సీతారామాచార్యులు పర్యవేక్షణలో అర్చక బృందం స్వామికి తమలపాకులతో సహస్రనామార్చన చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు ఒమ్మి నారాయణరావు, ఎం.ఎ.రాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రాజభాష అమలు కమిటీ సమావేశం



సమావేశంలో పాల్గొన్న వాల్తేర్ డివిజన్ అధికారులతో డీఆర్‌ఎం లలిత్‌బోరా

తాటిచెట్లపాలెం: దొండపర్తి డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో గురువారం 79వ రాజభాష అమలు కమిటీ సమావేశం జరిగింది. డివిజనల్ రైల్వే మేనేజర్, టౌన్ అఫీషియల్ లాంగ్వేజ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ చైర్మన్ లలిత్ బోరా అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. అధికార భాషా అమలు కోసం తీసుకోవాల్సిన చర్యలపై రీజినల్ ఇంప్లిమెంటేషన్ కార్యాలయం నుంచి డిప్యూటీ డైరెక్టర్ అనిర్బన్ విశ్వాస్ వర్చువల్‌గా వివరించారు. రాజభాష అమలులో ఈస్ట్ కోస్ట్ రైల్వే ప్రధాన కార్యాలయాల జాబితాలో ప్రథమ స్థానంలో నిలిచిందని ఆయన పేర్కొన్నా రు. హిందీ ప్రచారానికి సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం, హిందీ కార్యక్రమాల వివరాలను తెలియజేసే 'విశాఖ భారతి' పత్రిక సంచికను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం (ఆపరేషన్స్), టీవోఎల్ఐసీ డిప్యూటీ చైర్మన్ మనోజ్‌కుమార్ సాహూ, ఇన్‌చార్జి సెక్రటరీ టీవోఎల్ఐసీ/రాజభాష అధికారి సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

'ఉక్కు' కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ఆరిలోవ: విశాఖ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని జూ పార్కు కార్మికులు డిమాండ్ చేశారు. జూ పార్కు జాతీయ రహదారి వైపు ప్రధాన ద్వారం వద్ద గురువారం జూ కార్మికులతో కలిసి సీఐటీయూ మద్దిలపాలెం జోన్ నాయకులు నిరసన తెలిపారు. స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల నిర్బంధానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సిటు మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వెంకటరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఇంతవరకు 1,500 మంది కార్మికులను తొలగించడంతో వారి కుటుంబాలు వీధిన పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు చర్యలు చేపట్టిందని, ఈ ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలన్నారు. సిటు నాయకులు నరేంద్రకుమార్, జూ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అప్పలరాజు, నరేష్, పైడిరాజు, నర్సింగరావు, శోభారాణి పాల్గొన్నారు.

కోలాహలంగా శ్యామలాంబ పరస



ప్రత్యేక అలంకరణలో శ్యామలాంబ



పరసలో దుకాణాల వద్ద జన సందడి

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్‌లో కొలువైన శ్యామలాంబ అమ్మవారి పండగ మహోత్సవంలో భాగంగా గురువారం ఆలయం వద్ద పరస కోలాహలంగా జరిగింది. దుకాణాల వద్ద జనం కొనుగోళ్లతో సందడి నెలకొంది. అమ్మవారికి ఉదయం ప్రత్యేక అభిషేకాలు, పసుపు కుంకుమలతో పూజలు జరిగాయి. శ్యామలాంబను పట్టు వస్త్రాలు, పూల దండలు, ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. ఆలయ పరిసరాలను విద్యుత్ దీపాలు, వేప మండలతో అలంకరించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ మూర్తిని పల్లకీలో ఊరేగించారు. భక్తులు పల్లకీని తాళ్లతో లాగడానికి పోటీపడ్డారు. అడుగడుగునా భక్తులు అమ్మవారికి హారతులు, టెంకాయలతో నీజారనాలర్పించారు. పండ్లు, పూలు, మిఠాయిలతో అమ్మవారి సారె ఊరేగింపు ఘనంగా జరిగింది. శుక్రవారం సాయంత్రం మేళతాళాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అనుపు ఉత్సవం జరుగుతుందని ఆలయ ప్రతినిధులు తెలిపారు.

సరస్వతీ నది పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

దాబాగార్డెన్స్: సరస్వతీ నది పుష్కరాలకు పయనమయ్యే భక్తుల కోసం ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. విశాఖ నుంచి పలువురు ప్రయాణికులు, భక్తులు గురువారం బయలుదేరగా.. జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు ద్వారకా బస్ స్టేషన్ వద్ద ఇంద్ర ఏసీ బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుష్కరాల కోసం ముందుగా సీట్ రిజర్వ్ చేసుకున్న భక్తుల కోసం ఈ బస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శుక్ర, శనివారాల్లో ద్వారకా బస్టేషన్ నుంచి బయలుదేరే సూపర్ లగ్జరీ బస్సులకు సంబంధించిన టికెట్లను ఆన్‌లైన్‌లో apsrtc.com వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవచ్చని చెప్పారు. ప్రయాణికులు పూర్తి బస్సును బుక్ చేసుకోవాలన్నా, విడివిడిగా టికెట్లు కావాలన్నా ఈ అవకాశం ఉందని పేర్కొన్నారు. 34 మంది కలిసి వచ్చినట్లయితే వారికి అనుకూలమైన రోజున ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రయాణికుల కోరిక మేరకు విజయవాడ, యాదాద్రి యాత్రలను కూడా కలిపి ఈ ప్రత్యేక బస్సులను అందించనున్నట్లు తెలిపారు. యాత్రికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 83092 65666, 90522 27083, 99592 25594, 91001 09731 నంబర్లలో సంప్రదించాలని కోరారు. డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి.సత్యనారాయణ, డిపో మేనేజర్ కె.గంగాధరరావు, అసిస్టెంట్ ఇంజినీర్ రామకృష్ణ, అసిస్టెంట్ మేనేజర్ ఉజ్వల, సూపర్‌వైజర్లు, సిబ్బంది ప్రయాణికులకు శుభాకాంక్షలు తెలిపారు.